

అనగనగా ఓ మంచి కథ

# కవిరాయడు – మహారాజు

## చింతా దీక్షితులు బి.ఏ.ఎల్.టి, సాహితీసమితి సభ్యుడు

## (భారతి 1924 సెప్టెంబర్ సంచికనుంచి పునర్ముద్రితం)

ఒకనాటి ప్రాతఃకాలమున కవిరాయడు స్వప్నావస్థనుండి మేల్కొన్నాడు. బాహ్య ప్రపంచ వైఖరి అతనికి గోచరమైనది. నిజస్థితియతని మనస్సునకు తట్టినది. ఖిన్నుడై పోయినాడు!

మహారాజునకు తనపై దయతప్పినదని యాతడు గ్రహించినాడు.

౨

కవిరాయడు కవి కుటుంబమున బుట్టినాడు. కవి గర్భమున జన్మించినాడు. ఆతడు పుట్టినప్పుడు కోకిలలు కూసినవి, చిలుకలు పలికినవి, మోడు చెట్లు చిగిరించినవి !

లోకమంతయు కవిరాయనికి స్వాగతము చెప్పినది. కవిరాయని జనకుడు తన హృదయమును ఆ సమయమున పరిశీలించి చూచికొన్నాడు. కవితారసమునకు బదులు ఆనందరసము హృదయమున నిండియుండుట గమనించినాడు. ఆనంద భాష్పములతో తనకు బుట్టిన కవిరాయని నొక్కమారు తలచుకొని "మహా రాజునకు కృతిగా నొసగగల నాకడసారి ప్రభంధ మితడేగదా." అనుకొన్నాడు. తన చిన్న ప్రబంధమును, ఈ కవిరాయని మహారాజు చేతిలోబెట్టి జనకుడు నిద్రావస్థను జెందినాడు.

3

మహారాజు రాజ్యభారమున మునిగి తేలుచున్నాడు. ఎయ్యది మంచి, ఎయ్యది చెడ్డ అను విషయమును నిర్ణయించుకొనుటలో కాలము జరిగిపోవుచున్నది. ప్రజలను శాసించుచున్నాడు, పన్నులు గొనుచున్నాడు. ఉపదేశ వాక్యములను మహర్షుల వదనముల నుండి వినుచున్నాడు. రాజ్యపరిపాలనము కష్ట సాధ్యమైన పని అనుకొనుచున్నాడు. అప్పుడప్పుడు మహారాజు చెవులలో కవులగీతములు పడుచుండుట కూడ కలదు. అవి ఈర్ష్యా గీతములో, ప్రణయ

గీతములో ఆ మహారాజు ఎట్లు నిర్ణయించుకొనగలడు ? కవిజనకుడర్పించిన కుమార ప్రబంధమును మహారాజు ఎక్కడనోపెట్టి మరచిపోయినాడు?

౪

కవిరాయడు చిన్ననాటి చెలిమికాండ్రతో ధృఢమైత్రి చేసికొని ప్రపంచమును మరచిపోయినాడు. చిలుకలతో జట్టుకట్టి తీయని పలుకులను నేర్చుకొన్నాడు.

కోయిలలతో సంచారము చేసి పలుకులకు మంజులత్వ మలవడ జేసి కొన్నాడు.

గోదావరి నాశ్రయించి స్వేచ్ఛాగాన మభ్యసించినాడు.

ఆతని నివాసము ఎల్లప్పుడు కొండలమీదను చెట్లమీదను.

ఆతని దృష్టులెల్లప్పుడు ఆకాశపథమున నక్షత్రమండలములవైపే.

ఈ సహవాస బలము చేత కొంతకాలము పాట పాడుటే మరచిపోయినాడు కవిరాయడు. సహవాసుల ప్రోద్భలము చేత కొంత కాలమునకు గీతములను పాడుట మొదలు పెట్టినాడాతడు.

ప్రకృతి గీతములు, ప్రణయగీతములు! చిలుకలు, కోకిలలు ఆతని గీతములు మెచ్చుకొన్నవి. ఇంతవరకును ప్రజలు రంగు బొమ్మలను మెచ్చుకొనువారు. సజీవగీతములను చూచి వారు మూకీభావము వహించినారు.

కవిరాయని వంశము వారందరు మహారాజునకు కృతులిచ్చినవారే.

కవిరాయడు చిలుకలకును, కోయిలలకును తన తొలిచూలి బిడ్డ నర్పించినాడు!

మంచి సావాసము చేయుచుండలేదని మహారాజు కవిరాయని మరచినాడన్నారు కొందరు! చిలుకలకును కోయిలలకును కృతి యిచ్చుట తగని పనిగా గణించి కోపమంది యుండవచ్చునని మరికొందరన్నారు! నిజస్థితి మాత్రమెవ్వరికిని తెలియలేదు.

౫

మహారాజునకు తనపై దయతప్పినదని తెలిసికొని కవిరాయడు ఖిన్నుడై దుఃఖ గీతములు పాడ మొదలు పెట్టినాడు. లోకమునావరించి యున్న దుఃఖసముద్రములోనవి లీనమై పోయినవి. కొంత కాలమునకు తెలివిదెచ్చుకొని మహారాజుపై గీతములల్లినాడు కవిరాయడు. మహారాజున కందచేయుదునని చెప్పి వాయువా గీతములను తన గర్భములో దాచుకొన్నది. మరల క్రొత్త గీతములనాతడు పాడినాడు. మహారాజునకంద చేతుమని చెప్పి చిలుకలా గీతములను దాచి వేసినవి.

క్రొత్త కృతుల మరల నాతడు కల్పించినాడు. ఈ మారు కోయిలలాకృతులను మహారాజున కందజేతుమని చెప్పి పుచ్చుకొని ఎక్కడకో లేచిపోయినవి.

తన చిన్ననాటి సహవాసులు తనపై కినుక వహించినట్లాతడు గ్రహించినాడు. చిన్ననాటి సావాసగాండ్రను పూర్తిగా మరచినాడు. లోకమునంతను పూర్తిగా మరచినాడు. తన దృష్టి మహారాజుపై నిల్పి ఎంతో విశ్వాసముతోనాతని దన హృదయ పీఠమున నిల్పుకొన్నాడు.

"ధన దేవతనుపాసించుచున్నావా" యని చిలుకలు గేలిచేసినవి.

"మేము లేని గీతములు గీతములా"యని కోయిలలు పరిహసించినవి.

"వంశగౌరవమును కాపాడుకొనవలెను సుమా" యని స్వప్నములో కవిజనకుడాదేశించినాడు.

కవిరాయని దృష్టిమాత్రము చెదరలేదు. ఒకటే లక్ష్యము అది మహారాజే.

కవిరాయనికి యౌవనము వచ్చినది.

మహారాజునకు దయకలుగలేదు.

౬

ధ్యానముద్రలో కొంతకాలముండి తరువాత మహారాజుపై మరల గీతములు వ్రాయ మొదలు పెట్టినాడు కవిరాయడు.

సొంతముగా వీనిని తాను కృతియీయదలుచుకొన్నాడు మహారాజునకు.

మహారాజు దర్శనము కవిరాయనికి కలుగలేదు. తన వంశీయుల పూర్వకృతులలో గలిపి తన కృతులను గూడ గొంతెత్తిపాడ మొదలు పెట్టినాడు కవిరాయుడు.

మహారాజు కార్యభారమున నుండుటచే ఆతని చెవుల బడలేదివి.

గీతముల సంఖ్య నానాటికి హెచ్చిపోవుచున్నది. పాటలు నిరతము పాడుటచే కవిరాయని గొంతు బొంగురుపోవుచున్నది.

మహారాజు కార్యనిమగ్నుడై యున్నాడు. కవి రాయనికి నిరాశ ఎక్కువగుచున్న కొలది మహా రాజుపై విశ్వాసము అధికము కాజొచ్చినది. తాను రచియించిన గీతముల నన్నింటిని లోకములో ప్రచారార్థమై వదలిపెట్టినాడు కవిరాయడు.

లోకములోని వారు గీతములను పఠించినారు. "మహారాజు హృదయము వజ్రశకల"మన్నారు కొందరు.

"కవిరాయడు ప్రకృతిని వదలిపెట్టిన తరువాత స్తోత్రపాఠములను వ్రాయుచున్నాడు గాని గీతములను వ్రాయుటలేద"న్నారు కొందరు. "సత్కార్యమునకు కవిరాయడు ఫలము నాశించుటతప్ప"న్నారు కొందరు.

"వంశాచారమును వదలించుకొనుట ఎవ్వరితర"మని కొందరన్నారు.

కవిరాయనికి లోకముపై కోపము పుట్టినది. మనస్సున కొకవిగ్రహము కల్పించుకొని తాను రచించిన కృతులనన్నింటిని దానికి కృతి యీయ మొదలు పెట్టినాడు.

ఆ విగ్రహమే మహారాజన్నాడు కవిరాయడు. ఎంతో కాలము గడిచినది.

మహారాజు తల నెరసినది, ఒడలు ముడుతలు పడినవి. రాజ్యభారము నానాటికి అతిశయించు చున్నది.

కవిరాయనికి దృష్టి మందగించినది. చేతులు వణుకుచున్నవి. కంఠము రుద్ధమైనది. గీతములను పాడుచునే యున్నాడు.

మహారాజునకు కవిరాయని పై అనుగ్రహము కలుగలేదు. కవిరాయనికి మహారాజు పై విశ్వాసము తగ్గలేదు!

★★★

COMMENTS